అవినీతి పాలనను అంతమొందించాలి

ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్



గుజ్జ సత్యంను కలిసిన మధుయాష్కీగౌడ్

నాగోలు: బీఆర్ఎస్ పార్టీ అవినీతి పాలన అంతమొందించేందుకు ప్రజలంతా ఏకధాటిపైకి రావాలని ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధు యాష్కీగౌడ్ అన్నారు. శుక్రవారం నాగోలు సాయినగర్ కాలనీలోని బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఇంటికి వచ్చి మద్దతు కోరారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ, గతంలో బీసీ దళపతి అయిన ఆర్. కృష్ణయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్నామని, ఈసారి ఎల్‌బీనగర్‌లో బీసీ బిడ్డ మధుయాష్కీ గౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపుతామన్నారు. కార్యక్రమంలో లింగోజిగూడా కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, ఎల్బీనగర్ పద్మశాలీ సంఘం అధ్యక్షులు పున్న గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, మమత నగర్ కాలనీ ప్రతినిధులు అమరేందర్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చౌటుపల్లి సురేశ్, తెలంగాణ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ జలపల్లి కిరణ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు పండరినాథ్, రాపోలు నరసింహ, గడ్డం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత్‌నగర్‌లో బీఆర్ఎస్ ప్రచారం



ఈస్ట్ ప్రశాంత్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న అజిత్‌రెడ్డి సతీమణి సునరితారెడ్డి

మలక్‌పేట: బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో అపారమైన విశ్వాసం ఉందని ఆ పార్టీ మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి సతీమణి, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి అన్నారు. మూసారంబాగ్ డివిజన్ ఈస్ట్‌ప్రశాంత్‌నగర్‌లో శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఓటర్లను కలిసి కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. నాయకులు బట్టు దాసురావు, గోపాల్, లక్ష్మి, టిన్ను సింగ్, బాబురావు, విజయలక్ష్మి, సక్కుబాయి, నాగమణి ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

మలక్‌పేట మజ్లిస్ అభ్యర్థి బలాల



మలక్‌పేటలో ప్రచారం చేస్తున్న అహ్మద్ బలాల

మలక్‌పేట: అభివృద్ధిలో మలక్‌పేట ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని, అదే తరహాలో అభివృద్ధి కొనసాగింపు కోసం మరోసారి ఎమ్మెల్యేగా అవకాశం కల్పించాలని మజ్లిస్ పార్టీ అభ్యర్థి అహ్మద్ బలాల అన్నారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. పతంగి గుర్తుకు ఓటేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

బీఆర్ఎస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

బీజేపీ యాకుత్‌పురా, మలక్‌పేట అభ్యర్థుల పిలుపు

చంచల్‌గూడ: జాతీయవాదులు, రాష్ట్ర ప్రభుత్వ బాధితులు, పీడితులు కలిసికట్టుగా ముందుకు రావాలని యాకుత్‌పురా, మలక్‌పేట బీజేపీ అభ్యర్థులు వీరేందర్‌యాదవ్, సంరెడ్డి సురేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం వీరేందర్‌యాదవ్ కర్మగూడ డివిజనలో, సురేందర్‌రెడ్డి చావణీ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తమ అమూల్యమైన ఓటు కమలం గుర్తుకు వేయాలని వేడుకున్నారు. ప్రజలంతా ఈసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో జాతీయ కౌన్సిల్ సభ్యుడు సహదేవ్‌యాదవ్, కన్వీనర్ ధీరజ్‌లాల్, నాయకులు తంగెళ్ల సుధీర్, దశరథ లక్ష్మి, శ్రీనాథ్, వెంకట్‌రెడ్డి, నాగరాజు, గోపి, గజానంద్, తదితరులున్నారు.

'హస్తం'తోనే తెలంగాణ అభివృద్ధి

ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్

తుక్కుగూడ: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేఎల్ఆర్ అన్నారు. శుక్రవారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కేఎల్ఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. నియోజకవర్గంలో పార్టీ గెలుపు ఖాయమని, పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రచారం చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నారెడ్డి, సృజన్‌రెడ్డి, బుచ్చిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు చిగిరింత నర్సింహ్మారెడ్డి, జానకీరామ్, ఏనుగు జంగారెడ్డి పాల్గొన్నారు.

పూజలు.. పరామర్శలు

కందుకూరు: కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి శుక్రవారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. అన్నోజిగూడలో నిర్మించిన ఆంజనేయస్వామి దేవాలయంలో ఏర్పాటు చేస్తున్న ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొని పూజలు చేశారు. కొత్తగూడలో బొక్క వెంకట్‌రెడ్డి చిన్న కుమారుడు నాని ఇటీవల మృతి చెందగా.. వారిని పరామర్శించి సంతాపం తెలిపారు. మీర్‌ఖాన్‌పేటలో కరుణాకర్‌రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పించారు. ఆయన వెంట జెడ్పీ మాజీ ఫ్లోర్ లీడర్ ఏనుగు జంగారెడ్డి ఉన్నారు.

అనాథ విద్యార్థి గృహానికి రూ.25 వేల విరాళం

దిల్‌సుఖ్‌నగర్: మన్సూరాబాద్ విజయ శ్రీకాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్ రెడ్డి, మీనా దంపతులు శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్‌లోని చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి శుక్రవారం రూ.25 వేల చెక్కును విరాళంగా అందజేశారు. తన తండ్రి దివంగత నారాయణ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఈ విరాళం అందజేసినట్టు మోహన్ రెడ్డి తెలిపారు. తాము ఇచ్చిన విరాళం డబ్బుతో విద్యార్థి గృహంలోని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్టేషనరీ కొనుగోలు చేయాలని గృహం అధ్యక్షుడు మార్గం రాజేష్‌ను కోరారు.

యువతిని వేధించిన యువకుడికి జైలు

హయత్‌నగర్: తనను ప్రేమించాలని యువతిని వేధించిన యువకుడికి ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 20 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం హయత్‌నగర్‌లోని 14వ మెట్రోపాలిటన్ కోర్టు తీర్పు ఇచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... నల్లగొండ జిల్లా చండూరు మండలం తెరటిపల్లికి చెందిన ఓ యువతి 2018 సంవత్సరంలో హయత్‌నగర్‌లోని ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదివేది. ఆ సమయంలో హయత్‌నగర్ పద్మావతి కాలనీకి చెందిన కర్నపాటి ఉపేందర్ ఆమెను వెంబడిస్తూ తనను ప్రేమించాలని వేధించేవాడు. సెల్‌ఫోన్‌లో, వివిధ మాధ్యమాల ద్వారా మెసేజ్‌లు పంపడమే కాకుండా బస్సులో, స్నేహితుల వద్ద ఉన్నప్పుడు కూడా ఆ యువతిని వేధింపులకు గురిచేసేవాడు.. అతడి ప్రేమను ఆమె నిరాకరించినా ఉపేందర్ తన ప్రవర్తనను మానుకోలేదు. దీంతో బాధితురాలు 2018 మార్చిలో హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. సాక్ష్యాధారాలు పరిశీలించిన కోర్టు నిందితుడు ఉపేందర్‌కు ఆరు నెలల జైలు, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది.

ప్రలోభాలు... విందు రాజకీయాలు!

- ఎల్బీనగర్‌లోని పలు కాలనీల్లో మరూ
- రాత్రి వేళ ఓటర్లకు మందు పార్టీలు
- అడిగింది ఇస్తామని హామీలు



ఎల్‌బీనగర్: ఓటర్లను ఆకట్టుకునేందుకు ఎల్‌బీ నగర్ నియోజకవర్గంలోని పలు కాలనీల్లో ప్రలోభాలతో విందు రాజకీయం మొదలైంది. ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు ఇప్పటికే పలు కాలనీలో రోజు వారీగా రాత్రి వేళలో మందు పార్టీలతో ఓటర్లను ప్రలోభపర్చుకునే పనిలో పడ్డారు. పార్టీ అభ్యర్థులు విజయానికి దోహదపడే ఏ ఒక్క అంశాన్ని కూడా వదులుకోవడంలేదు. ప్రతి రోజూ కాలనీలో ఇంటింటి ప్రచారంతో ర్యాలీలు, చేరికలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. కాలనీలో ఓట్లు దండుకునేందుకు పసందైన దావత్‌లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఆయా పార్టీలకు చెందిన నాయకులతో మాట్లాడి కాలనీ నాయకులు అందరూ హాజరయ్యేలా చూస్తున్నారు. దావత్ సమయంలో అభ్యర్థులు వచ్చి వారితో కాసేపు ముచ్చటించి తమకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కారాని హామీలు..

ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు కాలనీలో నెలకొన్న సమస్యలపై ప్రజలకు హామీలు గుప్పిస్తున్నారు. తాను విజయం సాధించిన వెంటనే మీ సమస్యలను పరిష్కరిస్తానని, అందరూ తన విజయానికి సహకరించాలని కోరుతున్నారు. కొందరు స్థానిక రాజకీయాలతో తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తారు. అలాంటి వారిని తమపైపు తిప్పుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

అపార్ట్‌మెంట్స్ సైతం..

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో అపార్ట్‌మెంట్లు అధికంగా ఉన్నాయి. కొందరు తమ అపార్ట్‌మెంట్లలో నిర్వహించే సమావేశాలకు అభ్యర్థులను ఆహ్వానించి తమ అపార్ట్‌మెంట్లకు రంగులు వేయాలని కోరుతున్నట్టు తెలుస్తోంది. మరి కొన్ని కాలనీల్లో సంక్షేమ భవనాలు, మినీ ఫంక్షన్ హాళ్లు, పార్కులు కావాలని కోరుతున్నారు. ఓట్లను దండుకునే ప్రయత్నంలో అభ్యర్థులు కాలనీవాసులు ఏది అడిగితే దానికి సై అంటూ హామీ ఇస్తున్నారు. లక్షల ఖర్చు అయినా లెక్క చేయకుండా ముందుకు సాగుతున్నారు.

పాఠశాలల్లో దీపావళి వేడుకులు



గడ్డిఅన్నారం నారాయణ స్కూల్లో ...

దిల్‌సుఖ్‌నగర్: ఎల్బీనగర్, మలక్‌పేట జోన్ల పరిధిలోని పలు పాఠశాలల్లో శుక్రవారం దీపావళి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు బొమ్మల కొలువును తీర్చిదిద్ది, వివిధ రకాల పూలతో అలంకరించారు. ప్రమిదలు అమర్చి దీపాలను వెలిగించారు. అనంతరం టపాసులు కాల్చి సందడి చేశారు. ఆర్‌కేపురం, గడ్డిఅన్నారం నారాయణ, చైతన్యపురి, వనస్థలిపురం, హస్తినాపురం రవీంద్రభారతి తదితర పాఠశాలల్లో దీపావళి వేడుకలు నిర్వహించారు.

ఆడబిడ్డను ఆదరించండి

మహేశ్వరం బీఆర్ఎస్ అభ్యర్థి మంత్రి సబితారెడ్డి



నామినేషన్ వేస్తున్న సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం: ఆడబిడ్డనైన తనను మరోసారి ఆశీర్వదించాలని విద్యాశాఖ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పట్లోళ్ల సబితారెడ్డి మహేశ్వరం ఓటర్లను కోరారు. శుక్రవారం కర్మాన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం భారీ ర్యాలీగా వెళ్లి మహేశ్వరం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మహేశ్వరంలో ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు.. రియల్ లీడర్‌తో పోటీ పడుతున్నారన్నారు. ఐదేళ్లుగా ఎక్కడా కనిపించని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్నికలు రాగానే.. ఓట్ల కోసం వస్తున్నారని ఎద్దేవా చేశారు. పట్లోళ్ల, తీగల కుటుంబాలు ఒక్కటయ్యాయని.. ఇక మహేశ్వరం గడ్డపై బీఆర్ఎస్‌కు తిరుగులేదని ధీమా వ్యక్తం చేశారు. ఆరు నూరైనా మూడోసారి గులాబీ సర్కార్ కొలువుదీరుతుందని స్పష్టంచేశారు. ర్యాలీ సందర్భంగా మహేశ్వరం గేటు నుంచి మండల కేంద్రం వరకు జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు దయానంద్‌గుప్త, యెగ్గె మల్లేశం, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు కార్తీక్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కళాఉత్సవ్

సైదాబాద్: విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలు, సాంస్కృతిక కళల్లోనూ చక్కగా రాణించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖాధికారి పి.సురేంద్రరావు సూచించారు. శుక్రవారం చంపాపేటలోని శ్రీత్రివేణి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కళాఉత్సవ్ ను ఆయన పాఠశాల డైరెక్టర్ కె.గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. చిన్నారులు చిత్రలేఖనం, చాక్‌పీస్‌తో అపురూప బొమ్మలు, సాంస్కృతిక జానపద నృత్యాలు వంటి అంశాల ప్రదర్శనలు ఆహుతుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు విచ్చేసి ఈ ప్రదర్శనను ఆసక్తిగా తిలకించారు. కళాఉత్సవ్‌లో ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు.



వేడుకల్లో పాల్గొన్న విద్యాశాఖాధికారి సురేంద్రరావు తదితరులు

అభివృద్ధిని చూసి..మరోసారి గెలిపించండి

ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



చైతన్యపురిలో మున్సిపల్ కాలనీ సమీపంలో పాదయాత్ర చేస్తున్న సుధీర్‌రెడ్డి

చంపాపేట/ఎల్‌బీనగర్/చైతన్యపురి: ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి శుక్రవారం చైతన్యపురి డివిజన్‌లోని మున్సిపల్ కాలనీ, ఇంద్రానగర్ తదితర కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి కారు గుర్తుపై ఓటువేసి తనను మరోమారు ఆశీర్వదించాలని కోరారు. ఆయా కాలనీవాసులు సుధీర్ రెడ్డికి డప్పు చప్పుళ్లతో పూల వర్షం కురిపిస్తూ స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు ఇచ్చి నుదుటున తిలకం దిద్ది ఆశీర్వదించారు. కొన్ని కాలనీల్లో కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు, పలు స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కుల సంఘ నేతలు ఆయనను కలిసి తామంతా కారు గుర్తుకే ఓటు వేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లలో ఉన్న 90 శాతం దీర్ఘకాలిక సమస్యలకు వేల కోట్ల ప్రత్యేక నిధులతో శాశ్వతంగా పరిష్కరించామన్నారు. మిగిలిన కొద్దిపాటి పనులు ఎన్నికల అనంతరం పూర్తి చేస్తామన్నారు. ఎల్‌బీనగర్‌లోని కాలనీల ఉనికి కూడా తెలియని కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నాడని, ఈ నియోజకవర్గాన్ని ఆయన ఏ విధంగా అభివృద్ధి చేస్తాడో కాలనీవాసులే అర్థం చేసుకోవాలన్నారు. బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డికి ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదని సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్‌బీనగర్‌లో తాను చేసిన అభివృద్ధే తన ఘనవిజయానికి దోహదపడుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు తోట మహేష్‌యాదవ్, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, పవన్, సరేష్, చిన్నా యాదవ్, శ్రీహరి, నాగలక్ష్మి, జయశ్రీ పాల్గొన్నారు. ఇలా ఉండగా, చంపాపేట డివిజన్ దుర్గాభవానీనగర్‌కు చెందిన గౌడ సంఘ నేత కొత్త నరేష్‌గౌడ్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామివారి ఆలయ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

ఆర్యవైశ్యులకు అండగా బీఆర్ఎస్ ప్రభుత్వం..

వనస్థలిపురం: ఆర్యవైశ్యులకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, ఆర్యవైశ్యులకు ఉప్పల్ భాగాయత్ దగ్గర 5 ఎకరాల స్థలంను ముఖ్యమంత్రి కేసీఆర్ కేటాయించారని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హస్తినాపురం జీఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్య వైశ్యుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, నాయకులు ముద్దగొని రాంమోహన్‌గౌడ్, క్యామ మల్లేష్, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రవికుమార్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జనసంద్రమైన ఎల్‌బీనగర్

- భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి



తల్లి ఆశీర్వాదం తీసుకుంటున్న సామ రంగారెడ్డి



కార్యకర్తలు, అభిమానులతో జనసంద్రంగా మారిన ఎల్‌బీనగర్



నామినేషన్ వేస్తున్న అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి శుక్రవారం భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్‌ను దాఖలు చేశారు. రంగారెడ్డి మొదట తన తల్లి ఆశీర్వాదం తీసుకొని నామినేషన్ వేసేందుకు హయత్‌నగర్ నుంచి కొత్తపేటకు బయలుదేరారు. హయత్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యకర్తలు, అభిమానులతో విజయవాడ జాతీయ రహదారి సుమారు 5 కిలో మీటర్ల మేర జనసంద్రంగా మారింది. చింతలకుంట వద్ద బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరై కార్యకర్తలు, అభిమానుల్లో హుషారు నింపారు. బీజేపీ మిత్రపక్షమైన జనసేన ఎల్‌బీనగర్ కన్వీనర్ శిరీష జనసైనికులతో హాజరయ్యారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని బీజేపీ కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల అరుణ సురేందర్‌యాదవ్, మొద్దు లచ్చిరెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, పవన్‌కుమార్, ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, రంగ నర్సింహగుప్తా, బీజేపీ ఎల్‌బీనగర్ కన్వీనర్ రవీందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కళ్లెం రవీందర్‌రెడ్డి ర్యాలీలో పాల్గొని కార్యకర్తల్లో జోష్ నింపారు. నామినేషన్ వేసిన అనంతరం సామ రంగారెడ్డి మాట్లాడుతూ, గత 16 సంవత్సరాలుగా ఎల్‌బీనగర్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తూ వచ్చానని, ఎల్‌బీనగర్‌ను అభివృద్ధి చేయాలనే తాపత్రయంతోనే ఎన్నికల బరిలో దిగానని అన్నారు.

జీహెచ్ఎంసీ ఫలితాలే పునరావృతం: రాజాసింగ్

మన్సూరాబాద్: జీహెచ్ఎంసీ ఫలితాలే పునరావృతమై ఎల్‌బీనగర్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని, సామ రంగారెడ్డి అసెంబ్లీలోకి అడుగు పెట్టడం ఖాయమని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ధీమా వ్యక్తంచేశారు. బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి రంగారెడ్డి నామినేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన బుల్డోజర్ ఎక్కి మాట్లాడారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అతని అనుచరుల ఆగడాలు ఎల్‌బీనగర్‌లో మితిమీరిపోయాయని, సుధీర్‌రెడ్డి పాలిట సామ రంగారెడ్డి బుల్డోజర్ అని అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తన అక్రమ ఆస్తులను కాపాడుకోవటానికి పార్టీని ఫిరాయించాడని ఆరోపించారు.



బుల్డోజర్ ఎక్కి మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

చీకోటి ప్రవీణ్‌కు డాక్టరేట్



చీకోటికి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేస్తున్న యునైటెడ్ థియోలాజికల్ రీసర్చ్ యూనివర్సిటీ ప్రతినిధులు

లక్డీకాపూల్: అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన యునైటెడ్ థియోలాజికల్ రీసర్చ్ యూనివర్సిటీ జంతుప్రేమికుడు చీకోటి ప్రవీణ్ కుమార్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. శుక్రవారం బంజారాహిల్స్‌లోని తాజ్‌డక్కన్‌లో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు ఆయనకు డాక్టరేట్‌ను అందజేశారు. సామాజిక సేవతో పాటు జంతు ప్రేమికుడిగా పర్యావరణ పరిరక్షణకు చేయూతనందిస్తున్నందుకు చీకోటికి ఈ గుర్తింపు లభించిందని పలువురు వక్తలు పేర్కొన్నారు. జంతువుల పట్ల ఆయన చూపుతున్న ప్రేమాభిమానాలు పలువురికి మార్గదర్శకం కావాలని ఆకాంక్షించారు. ఎస్ఎం యోగా అసోసియేషన్ నిర్వాహకుడు డాక్టర్ ఎంఎస్ రవి కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత జడ్జి మాధవరావు, సుప్రీంకోర్టు న్యాయవాది జీవీఎస్ వర ప్రసాద్, రిటైర్డ్ ఎస్పీ కె.రాజ శిఖామణి, నటుడు రాఘవ శ్రావణ్, వెంకట్ ఫణి, వీవీజీ రాజు, డాక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL DISTRICT JUDGE RANGA REDDY DISTRICT AT : L.B. NAGAR
O.S.No. 577 of 2023

Between:
Nanduri Venkata Surya Narayana Rao And others
Represented by GPA Holder
Koutha Lakshmi Narasimha Sarma ...Plaintiff
And
Dhananjay & others ...Defendants
To
ALL CONCERNED

Take notice that the Plaintiff filed the above Suit for Declaration declaring the Plaintiffs is the Legal Heirs of Late N. N. Sandhya @ Nanduri Sandhya, W/o. Nanduri Venkata Surya Narayana Rao in respect of the suit schedule properties and the suit is stands posted to **16-11-2023.** If any person or persons having any objections or claims they may appear on **16-11- 2023** at 10.30 a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.

SCHEDULE OF THE PROPERTY - A

All that the unit No. G2 in Ground Floor of Manikanta Nilayam, consisting of 450 Sq. Ft. Plinth Area, including Common Area, along with undivided share of land admeasuring 14 Sq. Yards or 11.70 Sq. Meters out of total land admeasuring 250 Sq. Yards or 209 Sq. Meters, in premises bearing No. 1-9-35, on Plot No. 119, in Sy.No. 198 to 203, situated at Block No. 9, Dwarakapuram Colony, Kothapet Village, Uppal Mandal, L.B. Nagar Municipality, Ranga Reddy District under SRO, Uppal and total land bounded by: **North : 25' Wide Road, South : Plot No. 124, East : Plot No. 118, West : Plot No. 120.**

SCHEDULE OF THE PROPERTY - B

All that the piece of land known as Plot No. 1022, admeasuring 300 Sq. Yards or equivalent to 250.83 Sq. Meters situated at Khanamet Village, Rajendra Nagar Tq., Ranga Reddy District forming part of Survey Nos. (11/14, 11/15, 11/16, 11/17 and 11/18) part of Survey No. 11 and bounded by : **North : Plot No. 1023, South : Plot No. 1021, East : 30' Wide Road, West : Plot No. 1001.**

(BY ORDER OF COURT)
Sd/- M/s. Y. Ravi Kiran
K. Jagadeeshwara Chary,
Advocates, Hyderabad.

ముగిసిన నామిషనేషన్ల ప్రక్రియ

- చివరి రోజున ఎల్బీనగర్‌లో 49 దాఖలు
- మొత్తం 62 మంది అభ్యర్థులు... 87 నామినేషన్లు

చైతన్యపురి: అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమైన నామిషనేషన్ల ప్రక్రియ ముగిసింది. ఈనెల 3వ తేదీన నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా, శుక్రవారంతో నామినేషన్ల దాఖలకు గడువు పూర్తయింది. ఎల్‌బీనగర్‌లో చివరి రోజు 49 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్. పంకజ తెలిపారు. బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డి భారీ ర్యాలీగా వచ్చి మరో సెట్ నామినేషన్ శుక్రవారం ఆర్‌ఓకు అందజేశారు. ప్రధాన పార్టీలతో పాటు ఈసారి ఇండిపెండెంట్లు అధికంగా నామినేషన్ వేశారు. 62 మంది అభ్యర్థులు మొత్తం 87 సెట్ల నామమినేషన్లు దాఖలు చేశారు. 13న నామినేషన్ల పరిశీలన, 15న నామినేషన్ ఉపసంహరణ అనంతరం ఎంత మంది ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉండనున్నారో తెలుస్తుంది.

మలక్‌పేటలో చివరిరోజు 8 దాఖలు

మొత్తం నామినేషన్లు 47.. అభ్యర్థులు 32

సైదాబాద్/చాదర్‌ఘాట్: మలక్‌పేట నియోజకవర్గంలో మొత్తం 47 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయితే కొందరు అభ్యర్థులు రెండు, మూడు సెట్ల నామినేషన్లు వేయగా అభ్యర్థుల సంఖ్య 32గా తేలింది. ఈ 32 మందిలో ఉపసంహరణ చేసేదెవరో, తిరస్కరణకు గురవగా మిగిలే అభ్యర్థులు ఎవరో ఐదు రోజుల్లో తెలుస్తుంది.

- కాగా, శుక్రవారం చివరి రోజు 8 మంది ఇండిపెండెంట్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి తెలిపారు. ప్రధాన పార్టీలు అయిన బీజేపీ అభ్యర్థి తిరిగి ఒక సెట్, బీఆర్ఎస్ అభ్యర్థి ఒక సెట్, ఎంఐఎం అభ్యర్థి ఒక సెట్ దాఖలు చేసినట్లు తెలిపారు. అలాగే బీఎస్పీ అభ్యర్థి బీఫాంతో నామినేషన్ దాఖలు చేసినట్లు ఆర్‌ఓ తెలిపారు.